అందాలు అచ్చెరువు..



రామప్పలో అందాల భామలతో మంత్రి సీతక్క

రైతన్న గుండె చెరువు..



ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో వరద దాటికి కొనుగోలు కేంద్రంలోకి వచ్చిన నీరు వెళ్లేందుకు కాల్వ తీస్తున్న రైతు



హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలోని నంది విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న ప్రపంచ సుందరీమణులు

# చీరకట్టులో మెరిసి.. శిల్పకళకు మురిసి

- తెలుగుదనం ఉట్టిపడేలా సుందరీమణుల సందడి
- ఉమ్మడి జిల్లాలో మిస్ వరల్డ్ బృందం పర్యటన
- వేయిస్తంభాల గుడి, ఖిలా వరంగల్, రామప్ప ఆలయాల సందర్శన
- ఓరుగల్లు ఆతిథ్యానికి మురిసిపోయిన యువతులు

*సంప్రదాయ చీరకట్టులో.. పట్టు పరికిణీల్లో తెలుగుదనం ఉట్టిపడే సంప్రదాయ వేషధారణలో హొయలు పోతూ సుందరీమణులు మెరిసిపోయారు. ఓరుగల్లు పర్యటనలో భాగంగా మిస్ వరల్డ్ కాంటెంటెస్టల్లో బుధవారం ఒక బృందం వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్‌లో, మరో బృందం రామప్ప ఆలయాన్ని సందర్శించింది. హైదరాబాద్ నుంచి సాయంత్రం చేరుకున్న ఈ అందగత్తెలకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటలు, కోలాటాలు ఆడి సందడి చేశారు. ఆలయ శిల్పకళకు ముగ్ధులైన విదేశీ యువతులు గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి పూజల్లో పాల్గొని కొత్త అనుభూతికి లోనయ్యారు. కాకతీయుల శిల్ప సంపద అద్భుతం.. హిస్టారికల్ టెంపుల్ థౌజండ్ పిల్లర్స్, బ్యూటీఫుల్ టెంపుల్.. ఓం నమఃశివాయ అంటూ కితాబునిచ్చారు.*

*- వరంగల్/హనుమకొండ/హనుమకొండ చౌరస్తా/వెంకటాపూర్, మే 15*

వరంగల్ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం 4.42 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌కు 20 మంది అందగత్తెలు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా పర్యాటక శాఖ బి-2 బస్సుల్లో అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా, కెనడా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, ఎల్ సాల్వేడార్, గ్వాటేమాల, హైతీ, హోండురస్, మెక్సికో, నికరాగ్వా, పరాగ్వే, పనామా, పెరూ, అమెరికా, సూరినామ్, వెనుజుల, బెలిజ్ దేశాలకు చెందిన సుందరీమణులు రాగా వీరికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్య శారద, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజి వాకేడేలు, డీసీపీ సలీమా, అధికారులు బతుకమ్మలతో మహిళలు, సంప్రదాయ డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. హోటల్ వద్ద బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. తెలంగాణ చీరకట్టు, లంగావోని, బొట్టుతో ముస్తాబై వేయిస్తంభాల ఆలయానికి చేరుకోగా వారికి ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఆలయ ఈవో అనిల్‌కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేందర్‌శర్మ స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో ఉన్న కోనేరును, వేయి స్తంభాల ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించే శిలాశాసనాన్ని పరిశీలించారు. శిలాశాసనంలో ఉన్న ఆలయ చరిత్రని వారికి గైడ్ వివరించారు. నందీశ్వరుడి సన్నిధిలో ఫొటోలు తీసుకున్నారు.

**కోటలో అందాల భామల హెరిటేజ్ వాక్**

ఓరుగల్లు కోటలోని కాకతీయ శిల్పాల మధ్య ప్రపంచ సుందరీమణులు హెరిటేజ్ వాక్ చేశారు. సాయంత్రం 7.25 గంటలకు పశ్చిమ ద్వారం నుంచి కీర్తితోరణాల్లోకి చేరుకున్న అందాల భామలకు వరంగల్ ప్రత్యేక ఉత్పత్తి చపాట మిర్చి ఇచ్చి స్వాగతం పలికారు. వరంగల్ చపాట మిర్చి, పసుపు ఉత్పత్తుల స్టాల్‌తో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొత్తవాడ దర్రీ, రంగశాయిపేట హస్తకళల ప్రదర్శనను తిలకించి అబ్బురపడ్డారు. స్టాళ్ల వద్ద సెల్ఫీలు దిగారు. అక్కడి నుంచి శిల్పాల మధ్య నడుచుకుంటూ ఒక్కో శిల్పాన్ని తిలకించగా వాటి విశిష్టతను టూరిజం గైడ్ వివరించారు. 20 మంది ప్రపంచ సుందరీమణులు చీరకట్టు, ముంజేతి గాజులు, నుదుట సిందూరంతో ఆకట్టుకున్నారు. సుమారు గంటన్నర పాటు కీర్తితోరణాల మధ్య గడిపారు. కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన వీరనారి రాణీరుద్రమదేవి పరాక్రమాన్ని వివరించే కూచిపూడి నృత్యంతో పాటు పేరిణి నృత్యం ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలను ఫొటోలు తీస్తూ ఎంజాయ్ చేశారు. మంత్రి కొండా సురేఖ రాక కోసం అధికారులు లైట్ అండ్ సౌండ్ షోను నిలిపివేశారు. కాకతీయుల రాజ్య చరిత్ర, వీరత్వాన్ని వివరించే షో మొదలువుతుందని వ్యాఖ్యాతలు ప్రకటించి లైట్లు ఆర్పివేశారు. అయితే అప్పటి వరకు మంత్రి రాలేదన్న విషయం తెలుసుకున్న అధికారులు ఆమె వచ్చిన తర్వాత 7.54 గంటలకు షోను ప్రారంభించి 10 నిమిషాల పాటు ప్రదర్శించారు. సుందరీమణులు సందర్శించి కీర్తి తోరణాల ప్రాంతాలను పోలీసులు నాకా బందీ చేశారు. రహదారులను మూసివేయడంతో పాటు బయటి వ్యక్తులు తిలకించే అవకాశం దక్కలేదని స్థానికులు నిరాశచెందారు. కాగా అందగత్తెలు రాత్రి 9.20 గంటలకు హరిత హోటల్‌కు డిన్నర్ ముగించుకొని 10.54 గంటలకు హైదరాబాద్ పయనమయ్యారు.

**రామప్ప శిల్పకళకు ముగ్ధులై..**

ఇక మరో బృందం 33 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కాటేజీ, సరస్సు వద్ద సంప్రదాయ చీరకట్టులో గ్రూప్ ఫొటోలు దిగి మురిసిపోయారు. అనంతరం సాయంత్రం 6గంటల సమయంలో ఆలయానికి చేరుకోగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, ఇతర అధికాలు కలిసి స్వాగతం పలికారు. అక్కడినుండి గొత్తికోయ నృత్యం నడుమ ఆలయంలోకి ప్రవేశించారు. గైడ్ ద్వారా ఆలయ విశిష్టత, శిల్పకళ ప్రాముఖ్యత్య తెలుసుకొన్నారు. అనంతరం పేరిణి న్వత్యం, అలేఖ్య గ్రూప్ నృత్యం, రాణీరుద్రమ దేవి చరిత్ర, సౌండ్ అండ్ లైట్‌షోలో ఆలయ నిర్మాణం తీరును, కాకతీయ, రామప్ప చరిత్రను వివరించారు. సుందరీమణులకు మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో డిన్నర్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు.





వరంగల్ కోటలోని కీర్తి తోరణం వద్ద ప్రపంచ సుందరీమణులు, జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి సురేఖ

# అన్నదాతకు కన్నీళ్లు

- అకాల వర్షంతో వరద పాలైన ధాన్యం
- గోగుపల్లిలో నీట మునిగిన కొనుగోలు కేంద్రం
- ఉప్పొంగిన ఊర వాగు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు
- ఏటూరునాగారంలో 5 సె.మీ వర్షపాతం
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్లేనని అన్నదాతల ఆగ్రహం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

*ఆ రైతులు రాత్రి వరకు తమ ధాన్యం కుప్పల మధ్యనే గడిపారు. 20 రోజులుగా ఆరబోసిన వడ్లు ఎండడంతో తెల్లారినంక బస్తాల్లో నింపాలనుకున్నారు. కొందరు రైతులు కాంటాలైన బస్తాలను లోడ్ చేయాలనుకున్నరు. మరికొందరు తమ విత్తన వడ్లను కంపెనీలకు అమ్ముకోవాలనుకున్నరు. ఇంటికి వెళ్లి నిద్రపోయారు. ఉదయం కొనుగోలు కేంద్రానికి వచ్చేసరికి పరిస్థితి అంతా తలకిందులైంది. తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పక్కనే ఉన్న వాగు ఉప్పొంగడంతో కేంద్రంలోని వడ్లన్నీ నీటిలో మునిగిపోయాయి. కొన్ని ధాన్యం కుప్పలు మొత్తం కొట్టుకుపోయాయి. ఈ దృశ్యాన్ని చూసిన రైతులు లబోదిబోమన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వరదపాలు కావడంతో కన్నీరు పెట్టుకున్నారు. కొట్టుకుపోగా మిగిలిన వడ్లను పోగు చేసుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. అన్నదాతకు తీరని నష్టం మిగిల్చిన ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది.*

*- ఏటూరునాగారం, మే 14*



గోగుపల్లి ఊర వాగు వరద ప్రవాహంలో మునిగిన ధాన్యం కుప్పలు

మండలంలో బుధవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి గోగుపల్లిలోని ఊర వాగు ఉప్పొంగి పక్కనే ఉన్న కొనుగోలు కేంద్రంలోకి వరద చేరింది. దీంతో అక్కడ నిల్వ ఉన్న సుమారు 30 మంది రైతులకు సంబంధించిన రెండు వేల బస్తాల ధాన్యం వరదలో మునిగిపోయింది. ఇందులో కొంత మంది రైతుల వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. రాత్రి వరకు అక్కడే ఉన్న రైతులు ఉదయం వచ్చి నీటిలో కొట్టుకుపోతున్న వడ్లను చూసి హతాశులయ్యారు. మధ్యాహ్నం వరకు వరద తగ్గుముఖం పట్టడంతో నీటిలో కొట్టుకుపోగా మిగిలిన వడ్లను పోగు చేసుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రంలో చిన్న కాల్వలు తీసి నీటిని బయటకు తరలించారు. మండలంలోని గోగుపల్లి రైతులు ఊరవాగు సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది, ఇరవై రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబోసుకోగా, కొందరు బస్తాల్లో నింపుకున్నారు. మరికొందరి రైతుల బస్తాల కాంటా పూర్తయినప్పటికీ మిల్లులకు తరలించలేదు. మరి కొందరు రైతులు విత్తన వడ్లను కంపెనీలకు అమ్ముకునేందుకు అక్కడ నిల్వ చేసుకోగా నీటిలో తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రంలో క్వింటాకు ఆరు నుంచి పది కేజీల తరుగు తీస్తున్నారని, సకాలంలో ధాన్యం నింపుకునేందుకు బస్తాలు కూడా ఇవ్వడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అకాల వర్షానికి అంతా నష్టపోయామని కన్నీరుమున్నీరవుతున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గోగుపల్లి కొనుగోలు కేంద్రానికి వచ్చి జేసీబీలతో మట్టి కట్టలు వేయడంతో పాటు కాల్వలు తీయించారు. నీట మునిగిన సెంటర్‌ను ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సందర్శించి బాధిత రైతులతో మాట్లాడారు. నష్టపరిహారం అందించేందుకు సిఫారసు చేస్తామన్నారు. సాయంత్రంలోగా జరిగిన నష్టంపై అంచనా వేయాలని, రోడ్డు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి రైతులు కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయింది. ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



కొనుగోలు కేంద్రంలో నీటిని తొలగిస్తున్న జేసీబీ

**ఆరు ఎకరాల్లో సాగు చేసిన**



నేను ఆరు ఎకరాల్లో వరి సాగు చేసిన. పది రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చి ఆరబోసిన. తేమ రావడంతో కుప్ప చేసి బుధవారం బస్తాలిస్తే నింపుదామనుకున్న. రాత్రి కురిసిన అకాల వర్షానికి వాగు ఉప్పొంగి కొనుగోలు కేంద్రంలోకి వరద రావడంతో వడ్ల కుప్ప మొత్తం మునిగిపోయింది. సుమారు 200 బస్తాల వరకు పంట వచ్చింది. వరదలో కొట్టుకుపోగా కొంత ధాన్యం మిగిలింది. సెంటర్‌లో బస్తాలు సరిగా ఇవ్వడం లేదు. బయట అప్పులు చేసి సాగు చేసినం. ధాన్యం కొట్టుకుపోవడంతో తీరని నష్టం వాటిల్లింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

*- ఈసం రమేశ్, రైతు, గోగుపల్లి*

# చిరు వ్యాపారులపై ప్రతాపమా ?

- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ మహాధర్నా
- రోడ్డు పక్కన సముదాయాల తొలగింపుపై మండిపాటు
- 48గంటల్లో పునరుద్ధరించాలని డిమాండ్
- లేకపోతే ఆందోళనలు తప్పవు: దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్, మే 14 : వరంగల్ నగరంలోని చిరు వ్యాపారులకు బీఆర్‌ఎస్ అండగా నిలిచింది. ప్రపంచ సుందరీమణుల నగర పర్యటనలో భాగంగా జీడబ్ల్యూఎంసీ అధికారులు రోడ్డు పక్కన ఉన్న వ్యాపార సముదాయాలను తొలగించడంపై మండిపడింది. బుధవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపట్టింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. గ్రేటర్ అధికారులు, పోలీసులు చిరు వ్యాపారుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అందాల భామల కోసం రోడ్డు పక్కన బతుకులీడుస్తున్న పేదలను ఆగం చెయొద్దని సూచించారు. నగర చారిత్రక నేపథ్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, పేదల వ్యాపార సముదాయాలను తొలగించడాన్ని నిరసిస్తున్నామని అన్నారు. 48గంటల్లో తొలగించిన సముదాయాలను పునరుద్ధరించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో చిరు వ్యాపారులకు రక్షణ కల్పించామని, మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయంలో కోట్లాది నిధులు ఖర్చు చేసి నగరంలో వెండింగ్ జోన్లు నిర్మించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలపై ప్రేమ, చిరు వ్యాపారులపై ప్రతాపం చూపుతున్నదన్నారు. ఇచ్చిన హామీలు మరిచి పేదలపై దౌర్జన్యం చేస్తున్నదని దాస్యం అన్నారు. అనంతరం దాస్యం నేతృత్వంలో ర్యాలీగా ఎంజీఎం జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు చేరుకోగా కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఆందోళనలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్దం రాజు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇమ్మడి లోహితరాజు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, మేకల బాబురావు, ఉడుతల సారంగపాణి, పశ్చిమ నియోజవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు టీ రమేశ్‌బాబు, నయీముద్దీన్, కొడకండ్ల సదాంత్, ఎండీ షఫీ, బజ్జూరి వాసు, జానకీరాములు, రామూర్తి పాల్గొన్నారు.



బల్దియా ఎదుట మహాధర్నాలో పాల్గొన్న దాస్యం

# పుష్కర స్నానమెలా ?

*పన్నెండేళ్ల కోసారి వచ్చే పుష్కరాలప్పుడు నదీస్నానమాచరిస్తే కోటి జన్మల పుణ్యఫలం వస్తుందంటారు. సర్వపాపాలు తొలగి ముక్తి లభిస్తుందని చెబుతారు. అందులోనూ ఇటీవల జరిగిన కాశీలోని ప్రయాగరాజ్ కన్నా త్రివేణి సంగమ స్థానంలో స్నానం చేస్తే చాలా గొప్పదంటారు. అయితే నేటి నుంచి ప్రారంభమయ్యే సరస్వతి నది(అంతర్వాహిని) పుష్కరాలకు రోజుకు లక్షకు పైగా భక్తజనం వచ్చే అవకాశం ఉంది. కానీ కాళేశ్వరంలో సరిపడా నీళ్లు లేక ఎక్కువ మంది పుణ్యస్నానమాచరించే పరిస్థితి కనిపించడం లేదు. మేడిగడ్డ బరాజ్ నుంచి నీటిని బయటికి పంపడంతో ఈ సమస్య తలెత్తగా, ఓ వైపు పుష్కర శోభ మొదలైనా ఏర్పాట్లు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా గురువారం ఉదయం మంత్రి శ్రీధర్‌బాబు పుష్కరాలను ప్రారంభించగా సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పుష్కరఘాట్ వద్ద సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించి నదీ స్నానం తర్వాత గోదావరి హారతి పూజల్లో పాల్గొననున్నారు.*

*- జయశంకర్ భూపాలపల్లి. మే 14(నమస్తే తెలంగాణ)*

- నేటి నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు
- త్రివేణి సంగమంలో అరకొర నీటి ప్రవాహం
- రోజుకు లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా
- ఇప్పటికీ పూర్తికాని ఏర్పాట్లు
- సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద అరకొర నీటి ప్రవాహం



కాళేశ్వరంలో నేటి నుంచి జరిగే సరస్వతీ(అంతర్వాహిని) పుష్కరాలకు నీటి సమస్య తలెత్తుతుంది. రోజుకు లక్ష మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నప్పటికీ ఒకేసారి లక్ష మంది త్రివేణి సంగమంలో స్నానమాచరించే పరిస్థితి మాత్రం కనబడడం లేదు. అందుకు తగినట్లు ఏర్పాట్లు సైతం జరుగడం లేదు. మేడిగడ్డ బరాజ్ నుంచి నీటిని బయటికి పంపడంతో కాళేశ్వరంలో నీటి సమస్య ఏర్పడింది. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లలో నీరు నిల్వ చేసినన్ని రోజులు కాళేశ్వరం నిండుకుండలా కనిపించేది. నేటి నుంచి పుష్కరాలు ప్రారంభం కానుండగా ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. పలు పనులు అర్ధంతరంగానే ఉన్నాయి. ఒకవైపు పుష్కరాలు జరుగుతుండగానే మరో వైపు పనులు కొనసాగించే పరిస్థితి కనిపిస్తుంది. ప్రభుత్వం రూ.25 కోట్లతో పనులు కొనసాగించగా సింగరేణి కాలరీస్ కంపెనీ రూ.78 లక్షలు కేటాయించింది. ఇదిలా ఉండగా ఎక్కువ శాతం పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయి. బుధవారం రాత్రి 10:35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కర కాలం ప్రారంభం కానున్నది. గురువారం ఉదయం సూర్యోదయం నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. నేడు (గురువారం) ఉదయం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సరస్వతీ పుష్కరాలను ప్రారంభిస్తారు. అలాగే సాయంత్రం 5గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సరస్వతీమాత విగ్రహావిష్కరణ చేసి సరస్వతీ నదిలో పుణ్యస్నానం ఆచరించి గోదావరి హారతి తదితర పూజల్లో పాల్గొంటారు. అలాగే రాష్ట్ర మంత్రులు, అధికారులు రానున్నారు. తెలంగాణ సహా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, వివిధ రాష్ట్రాల నుంచి రోజుకు లక్ష మంది భక్తులు పుష్కరాలకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. కాళేశ్వరం పరిసరాల్లో 14 పార్కింగ్ స్థలాలను, 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి 3,450మంది పోలీసులను బందోబస్తు కోసం నియమించారు. గోదావరిలో 40 కాటేజీలతో టెంట్‌సిటీని ఏర్పాటు చేశారు. వీటి ఒక్కో ధర సుమారు రూ.3వేలుగా నిర్ణయించారు. పుష్కరాల శోభను హెలిక్యాప్టర్‌లో వీక్షించేందుకు తొలిసారిగా భక్తుల కోసం ప్రత్యేక జాయ్ రైడ్‌లను సైతం ఏర్పాటు చేశారు. పుష్కరాల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నది. హైదరాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, నర్సంపేట, జనగామ, తొర్రూరు, పరకాల, మహబుబాబాద్ డిపోల నుంచి ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్ ఆర్‌ఎం విజయభాను తెలిపారు. సాధారణ టికెట్ ధరకంటే 1.5 రేట్లు చార్జి పెంచినట్లు ఆయన తెలిపారు. సరస్వతి(వీఐపీ ) ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతి అమ్మవారి విగ్రహం చుట్టూ బాహుబలి సెట్టింగ్ వేశారు. విగ్రహం ఎదుట రెండు వైపులా జ్ఞాన దీపాలు ఏర్పాటు చేశారు. 12రోజులు కాశీ పండితులతో నవ హారతులు, పూజలు నిర్వహించనున్నారు. రోజుకో పీఠాధిపతి పుష్కరాల్లో పాల్గొంటారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సరస్వతీ మాత విగ్రహం

**సింగరేణి చేయూత**

సింగరేణి సంస్థ సరస్వతీ పుష్కరాలకు రూ.78 లక్షలు కేటాయించింది. రూ.58 లక్షలు జిల్లా కలెక్టర్‌కు, రూ.20 లక్షలు పోలీసులకు అందజేసింది. వీటితో పాటు రూ.1.25 లక్షలతో 20 టెంట్ సిటీలను ఏర్పాటు చేశారు. అలాగే సింగరేణివ్యాప్తంగా ఉన్న సింగరేణి పాఠశాలల నుంచి 19 స్కూల్ బస్‌లను తీసుకొచ్చారు. ఇవి బస్టాండ్ నుంచి పుష్కరఘాట్ వరకు భక్తులను ఉచితంగా చేరవేస్తాయి. 30మంది సెక్యూరిటీ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంబులెన్స్, 15మంది స్కాట్ సిబ్బంది, 15మంది గజ ఈతగాళ్లను, 10మంది వంట మనుషులను సంస్థ సమకూర్చింది. భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి కాళేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

## సరస్వతీ పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

– దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్

మహదేవపూర్(కాళేశ్వరం)మే 14: సరస్వతి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆమె కాళేశ్వరంలో పర్యటించి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని సరస్వతి మాతా విగ్రహం, ఘాట్ ప్రారంభోత్సవం చేస్తారని, పుష్కర స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుంటారని, అనంతరం త్రివేణి సంగమంలో మొట్టమొదటి సారిగా కాశీ పండితులు నిర్వహించనున్న నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ కిరణ్ ఖరే, ముఖ్యమంత్రి భద్రతా అధికారి వాసుదేవరెడ్డి కలిసి ఈఓ కార్యాలయంలో అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు హెలికాప్టర్ ద్వారా సీఎం కాళేశ్వరం చేరుకుంటారని తెలిపారు.